రసవత్తరంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నిక

విశ్వంభర, హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయానికి ప్రధాన పార్టీలన్నా సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఒకరిపై ఒకరు విమర్శల బాణాలు వేసుకుంటున్నారు. ఏ ఒక్క అవకాశాన్ని జారవిడుచుకోకూడదని వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకెళ్తున్నాయి.

నియోజకవర్గంలో నాలుగు లక్షల మంది ఓటర్లున్నా అందులో 50 శాతం మందే అభ్యర్థుల తలరాతలు మార్చవచ్చని నేతలు విశ్వసిస్తున్నారు. 2009లో 52.76 శాతం, 2014లో 50.18 శాతం, 2018లో 45.59 శాతం, 2023లో 47.49 శాతం ఓట్లు పోలవడమే తాము ఇలా విశ్లేషించడానికి కారణమని చెబుతున్నారు. అంటే మొత్తం ఓట్లలో 30 శాతం ఓట్లు తెచ్చుకున్న అభ్యర్థికి గెలుపు నల్లేరుపై నడకే. ఏడు డివిజన్లు ఉన్న 'హిల్స్'ను గుప్పెట పట్టేందుకు పార్టీలు బలగాలను మోహరించాయి. ఏ ఓటరు ఎక్కడున్నారు.. ప్రత్యర్థి ప్రాంతాలు ఏవి.. ఏ సంఘాన్ని మచ్చిక చేసుకుంటే ఓట్లు మళ్లుతాయనే వ్యూహాలు ఇక్కడ గంట గంటకూ పదును తేలుతున్నాయి. ఈ నెల 11న జరిగే ఉప ఎన్నికలో సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు భారత రాష్ట్ర సమితి నుంచి మాగంటి సునీత గోపీనాథ్, అధికార కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్‌రెడ్డి బరిలోకి దిగగా ఆయా పార్టీలు అభ్యర్థుల విజయం కోసం అహరహం శ్రమిస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు.. భారత రాష్ట్ర సమితి నుంచి కేటీఆర్, హరీశ్‌రావు ఇతర నేతలు.. భాజపా నుంచి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఇతర నాయకులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. బస్తీల్లో ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు తమదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు.

మైనార్టీ ఓట్లు కీలకం..

ఎక్కువ ఓటర్లు ఉన్న రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, షేక్‌పేట డివిజన్లే ప్రధానంగా అభ్యర్థి విజయాన్ని నిర్ణయించనున్నాయి. మైనారిటీ ఓటర్లు ఉన్న బోరబండకూ ప్రత్యేక స్థానం ఉంది. పేరుకే జూబ్లీహిల్స్ అయినప్పటికీ కాలనీలు, బస్తీలు, మురికివాడలే అధికం. రహ్మత్‌నగర్‌లో దాదాపు 70 వేల ఓట్లు ఉన్నట్లు అంచనా. గడిచిన శాసనసభ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పోటీ పడ్డాయి. భారత రాష్ట్ర సమితి ముందు నిలిచింది. లోక్‌సభకు వచ్చేసరికి కాంగ్రెస్ పుంజుకుంది. ఎర్రగడ్డ, షేక్‌పేట, బోరబండల్లో మైనారిటీలు కీలకం. ఈ నియోజకవర్గం మొత్తంలో 1.10 లక్షలకు పైగా మైనారిటీ ఓటర్లు ఉంటారని పార్టీలు అంచనా వేస్తుండగా ఈ నాలుగు డివిజన్ల పరిధిలోనే ఎక్కువ మంది ఉన్నారు.

బీసీలను ఆకట్టుకునే ప్రణాళికలు..

ఈ ఉప ఎన్నికలో బీసీ ఓటు కూడా కీలకంగా మారింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా బీసీల రిజర్వేషన్ల అంశం తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. దీంతో బీసీలు సంఘటితం అయ్యారని అంచనా వేస్తున్న పార్టీలు వారిని ఆకట్టుకునే ప్రణాళికలు రచిస్తున్నాయి. వెంగళరావునగర్, సోమాజిగూడ, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో పలు చేతివృత్తుల కాలనీలు ఉన్నాయి. గౌడలు, మున్నూరుకాపులు, యాదవులు తదితర బీసీ వర్గాల ఓట్లు ఉప ఎన్నికలో ప్రధానమవుతున్నాయి. క్రైస్తవ సంఘాల్లో కూడా బీసీలు ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీసీలు వివిధ పార్టీల కింద విస్తరించి ఉన్నారు. పార్టీల నాయకులు.. ఆయా సంఘాల నేతలను పిలిపించుకుని చర్చిస్తున్నారు. వెంగళరావునగర్‌తోపాటు సోమాజిగూడ డివిజన్‌లో గేటెడ్ కమ్యూనిటీలు, పెద్ద పెద్ద అపార్టుమెంట్లు ఉన్నాయి. వీటిలో ఒకేచోట పెద్ద సంఖ్యలో ఓటర్లు నివసిస్తున్నారు. దీంతో ఆయా సంఘాల వారితో కొందరు పార్టీ బాధ్యులు ఒప్పందాలు చేసుకుంటున్నారు. కొన్ని కాలనీలకు చెందిన ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతోనూ మాట్లాడుతున్నారు.

విచ్చలవిడి హామీలతో జోరుగా ప్రచారం..

ఓటర్లను ఆకర్షించడం ఒక ఎత్తు కాగా గత శాసనసభ, లోక్‌సభ, నగరపాలక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీకి ఎక్కడ ఆధిక్యత వచ్చిందన్నదానిపై నాయకులు దృష్టి పెడుతున్నారు. ప్రత్యర్థికి పోలయ్యే వాటిని కొల్లగొట్టడమే లక్ష్యం అని ఓ పార్టీకి చెందిన డివిజన్ ఇన్‌ఛార్జి పేర్కొన్నారు. షేక్‌పేటలో గత శాసనసభ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి కన్నా కాంగ్రెస్‌కు ఎక్కువ ఆధిక్యత వచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లోనూ అంతే. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితికి ఓటెత్తారు. బోరబండ డివిజన్‌లో 65 వేల ఓట్లుండగా లోక్‌సభ ఎన్నికల్లో మినహా అన్ని ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితివైపే ఓటర్లు ఉన్నారు. రహ్మత్‌నగర్ డివిజన్‌లో కార్మికులు ఎక్కువ. జీహెచ్ఎంసీ, గత శాసనసభ ఎన్నికల్లో ఓటర్లు భారత రాష్ట్ర సమితివైపు ఉండగా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మొగ్గుచూపారు. యూసుఫ్‌గూడలో ఈ రెండు పార్టీలు నువ్వానేనా అన్నట్లు ఉంటూ వస్తున్నాయి. దీంతో ప్రత్యర్థి బలంగా ఉన్న కాలనీలు, బస్తీలపై నేతలు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఎక్కడికక్కడ స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలను తీరుస్తామంటూ హామీలు గుప్పిస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, పార్కులు బాగు చేయడం, సంఘాలకు టెంటు సామగ్రి కొనివ్వడం లాంటి భరోసాలు ఉంటున్నాయి.

జిల్లాల నుంచి వచ్చి కార్యకర్తల ప్రచారం..

నియోజకవర్గంలో 407 పోలింగ్ కేంద్రాల పరిధిలో 4.01 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రానికి వంద మందిని ఒక పార్టీ, పది మంది ప్రత్యేక ఇన్‌ఛార్జులను మరొక పార్టీ, తగినంత మంది ప్రచారకర్తలను ఇంకో పార్టీ నియమించుకున్నాయి. ప్రధాన పార్టీలు ఇతర జిల్లాల నుంచి మెరికల్లాంటి కార్యకర్తలను తీసుకొస్తున్నాయి. వరంగల్, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్ తదితర జిల్లాల నుంచి రెండు రోజులకు వంద మందిని ఓ పార్టీ ప్రచార బరిలోకి దింపుతోంది. మరోపార్టీ కీలక నేతను ఇన్‌ఛార్జిగా నియమించి ప్రతి వంద మంది ఓటర్లను కలిసేందుకు ఒక బృందాన్ని సిద్ధం చేసుకుంది. కొందరు అభ్యర్థులు ప్రచారానికి ఆటోలను, ద్విచక్రవాహనాలను అద్దెకు తీసుకుని నిత్యం ర్యాలీలు తీస్తున్నారు.

డిజిటల్ తెరలతో ప్రచారం..

పలు పార్టీలు సరికొత్త ప్రచారానికి తెరతీశాయి. డిజిటల్ తెరలు కూడళ్లలో ఆకర్షిస్తున్నాయి. రోడ్ షోలలో లేజర్ బీంలతో ప్రదర్శన ఉంటోంది. ఎల్ఈడీ స్క్రీన్లతో పార్టీ గుర్తులను ప్రదర్శిస్తున్నారు. సెన్సర్‌లు, లేజర్ బీంలతో పార్టీ గుర్తు, లయబద్ధమైన పాటలతో ఒక పార్టీ ఆకట్టుకుంటోంది. కొన్ని పార్టీలు ప్రత్యేకంగా సోషల్ మీడియా వార్ రూంలు నడిపిస్తున్నాయి. ప్రత్యర్థి లోపాలను అనుకూలంగా మార్చుకుంటున్నారు. కొందరు లేని మీడియా ఛానెళ్లు, పత్రికల పేర్లతో కంటెంట్‌ను సామాజిక మాధ్యమాలలో పోస్టు చేస్తూ తమను తికమకకు గురిచేస్తున్నారని ఓటర్లు చెబుతున్నారు.

హత్యలు, అపహరణలు, దోపిడీలకు మంత్రిత్వశాఖలు

బిహార్‌లో ఇండియా కూటమి నెగ్గితే జరిగేది అదే: అమిత్ షా

విశ్వంభర, పాట్నా : బిహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశం ఒకవేళ ఇండియా కూటమికి వస్తే.. హత్యలు, అపహరణలు, దోపిడీలకు మూడు మంత్రిత్వ శాఖలను తేజస్వీ యాదవ్ ఏర్పాటు చేస్తారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్ర ఆరోపణ చేశారు. ఇదివరకు ఆర్జేడీ అధికారంలో ఉన్నప్పుడు అపహరణలు, అత్యాచారాలతో ఆటవిక పాలనను బిహార్ చూసిందని, అది మళ్లీ రాకుండా ఓటర్లంతా ఎన్డీయే కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. ముజఫ్ఫర్‌పుర్, వైశాలీ జిల్లాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ఆదివారం ఆయన ప్రసంగించారు.

మోడీ, నీతీశ్‌లు నిష్కళంకులు

''బిహార్‌లో కొత్త ముఖాలతో జంగిల్‌రాజ్‌ను తిరిగి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. అది జరగకుండా ఎన్డీయేను గెలిపిస్తే వరదల నుంచి విముక్తి కల్పించడానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేస్తాం. భద్రతకు పెద్దపీట వేస్తాం. నదుల నీరు పొలాలకు పారేలా చూస్తాం. అంతర్గత కలహాలతో మహాగఠ్‌బంధన్ సతమతం అవుతోంది. లాలూ అండ్ కో, రాహుల్ అండ్ కో రూ.12 లక్షల కోట్ల అవినీతి, కుంభకోణాలకు పాల్పడ్డాయి. ఎన్డీయేలోని ఐదు మిత్రపక్షాలు మాత్రం బిహార్‌ను సరికొత్త ఎత్తుకు తీసుకువెళ్లేందుకు కట్టుబడి ఉన్నాయి. ఈ పక్షాలు పంచపాండవుల్లాంటివి. నీతీశ్ 20 ఏళ్ల పాలన, మోదీ 11 ఏళ్ల పాలన పూర్తిగా పారదర్శకం. వారిపై అవినీతి అభియోగాల్లేవు. మా కూటమిని గెలిపిస్తే 50 వేల కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తాం. వ్యవసాయంపై రూ.లక్ష కోట్లు వెచ్చిస్తాం. భారీ ఫుడ్‌పార్క్, ఇండస్ట్రియల్ పార్క్‌లు ఏర్పాటు చేయిస్తాం. లాలూరబ్రీ గానీ, సోనియాగానీ ఇలాంటివి చేయగలరా?'' అని అమిత్ షా ప్రశ్నించారు.

వ్యాపారవేత్తల చేతి రిమోట్ కంట్రోల్‌గా మోడీ

- ట్రంప్ అంటే ప్రధానికి భయం
- రాహుల్ గాంధీ

విశ్వంభర, బెగూసరాయ్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటే ప్రధాని మోదీ భయపడిపోతారని.. ఆయన బడా వ్యాపారవేత్తల చేతి రిమోట్ కంట్రోల్‌లాంటి వారని లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఆదివారం బిహార్‌లోని బెగూసరాయ్, ఖగడియా జిల్లాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. ''విశాలమైన ఛాతీ ఉన్నంతమాత్రాన బలవంతులైపోరు. మహాత్మాగాంధీని చూడండి.. బక్కపల్చగా ఉన్నా బ్రిటిష్‌వారిని గడగడలాడించారు. మోదీ తనకు 56 అంగుళాల ఛాతీ ఉందని గొప్పలు చెబుతారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ట్రంప్ ఫోన్ చేసేసరికి ఆయన భయపడిపోయారు.. పాక్‌తో సైనిక ఘర్షణను రెండ్రోజులకే ముగించేశారు. అంబానీ, అదానీ వంటి పారిశ్రామికవేత్తలకు ఆయన ఓ రిమోట్ కంట్రోల్. మోదీ సర్కారు నిర్ణయాలైన జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు వంటివన్నీ చిన్నవ్యాపారులను నాశనంచేసి, బడా వ్యాపారులకు లబ్ధి కలిగించేవే'' అని రాహుల్ విమర్శించారు. బెగూసరాయ్ జిల్లాలో ఓ చెరువులో మత్స్యకారులతో కలిసి చేపల వేటలో రాహుల్ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

విశ్వంభర, శ్రీకాకుళం : కాశీబుగ్గలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సమగ్ర విచారణ జరుగుతోందని, దర్యాప్తు పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి, ఓ ప్రకటన విడుదల చేశారు. ఘటనను వక్రీకరించి కొందరు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేశారని, ఆ పోస్టులను తీవ్రంగా పరిగణించి లొకేషన్ ఆధారంగా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు జరుగుతోందన్నారు.

బాధితులకు నేతల పరామర్శ..

పలాస, కాశీబుగ్గ, శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాశీబుగ్గ ఆలయ తొక్కిసలాట దుర్ఘటన క్షతగాత్రులను ఎన్డీయే, విశ్వహిందూ పరిషత్తుతోపాటు వివిధ పార్టీల నాయకులు ఆదివారం పరామర్శించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, భాజపా రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు బాధితులతో మాట్లాడి వారికి భరోసానిచ్చారు.

సిటింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి: బొత్స..

వైకాపా నేతలు.. శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, కె.కన్నబాబు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తదితరులు బాధితులను పరామర్శించారు. బొత్స మాట్లాడుతూ 'అది ప్రైవేటు ఆలయం, మేమేం నిర్ణయం తీసుకుంటాం' అని అనంతపురంలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించడం ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. ఘటనపై సిటింగ్ జడ్జి లేదా విశ్రాంత న్యాయమూర్తితో న్యాయవిచారణ జరిపించాలని డిమాండు చేశారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. వైకాపా తరఫున రూ.2 లక్షల నష్టపరిహారం మాజీ సీఎం జగన్ ప్రకటించినట్లు తెలిపారు.

బీసీలకు చట్టసభల్లో 50% రిజర్వేషన్ కల్పించాలి

విశ్వంభర, కర్నూల్ : పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలులో అసంపూర్తిగా ఉన్న బీసీ భవనం నిర్మాణానికి తన ఎంపీ లాడ్స్ నుంచి రూ.కోటి ఇస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టేలా కృషి చేయాలని కోరతామన్నారు. ఈ బిల్లు ప్రధాని మోదీ వల్లే సాధ్యం అవుతుందన్నారు. జనాభా గణనలో కులగణన కూడా చేపట్టాలని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, ఎన్డీయే ప్రభుత్వం మాత్రం సానుకూలంగా నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ వృత్తుల వారికి రాయితీ రుణాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. సమావేశంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బిహార్‌లో గెలుస్తాం.. 18న ప్రమాణం చేస్తాం

తేజస్వీ యాదవ్ ధీమా

26 నుంచి నేరగాళ్లపై కొరడా ఝుళిపిస్తామని వెల్లడి

విశ్వంభర, పాట్నా: బిహార్‌లో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం ఖాయమని ఇండియా కూటమి తరఫు ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ పునరుద్ఘాటించారు. ''ఈ నెల 14న శాసనసభ ఎన్నికల ఫలితాలు విడుదలవుతాయి. 18న ప్రభుత్వం కొలువుదీరుతుంది. ఆరోజు ప్రమాణ కార్యక్రమం ఉంటుంది'' అని తెలిపారు. జనసురాజ్ పార్టీకి మద్దతిస్తున్న దులార్ చంద్ హత్యకు సంబంధించి జేడీ(యూ) అభ్యర్థి, మొకామా మాజీ ఎమ్మెల్యే అనంత్ సింగ్ అరెస్టు నేపథ్యంలో తేజస్వి ఈ వ్యాఖ్యలు చేశారు. ''ఇవాళ ప్రధానమంత్రి బిహార్‌ను సందర్శిస్తున్నారు. రాష్ట్రంలో పరిస్థితిని ఆయన గమనించాలి. నేరం జరగకుండా ఒక్కరోజు కూడా గడవటం లేదు. కానీ మహాగఠ్‌బంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాక మార్పు వస్తుంది. కులమతాలతో సంబంధం లేకుండా ఈ నెల 26 నుంచి జనవరి 26 వరకు నేరస్థులందరినీ జైళ్లకు పంపిస్తాం. సాధ్యమైనంత కఠిన చర్యలు వారిపై తీసుకుంటాం'' అని చెప్పారు. బిహార్ ప్రజలు ఈసారీ నీతీశ్ కుమార్‌పై నమ్మకం ఉంచుతారని తెలిసి విదేశాల్లో విహారయాత్రకు వెళ్లేందుకు తేజస్వి టికెట్లు కొనుగోలు చేసినట్లు తనకు తెలిసిందని కేంద్ర మాజీ మంత్రి, భాజపా నేత రాజీవ్ ప్రతాప్ రూడీ ఎద్దేవా చేశారు.

భద్రత పెంచండి: తేజ్ ప్రతాప్

ప్రస్తుత పరిస్థితుల్లో తనకు ముప్పు పొంచి ఉందని.. భద్రతను మరింత పెంచాలని 'జనశక్తి జనతా దళ్' (జేజేడీ) చీఫ్ తేజ్ ప్రతాప్ యాదవ్.. కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల దుండగుల కాల్పుల్లో.. దులార్ చంద్ మరణించిన నేపథ్యంలో తనకూ ప్రాణ భయం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

దేశాభివృద్ధికి మహిళల భాగస్వామ్యం అవసరం

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

విశ్వంభర, హరిద్వార్: మనదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే మహిళల భాగస్వామ్యంతో పాటు అందరి సమష్టి కృషి అవసరమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లోని పతంజలి విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యూనివర్సిటీలో 62% మంది విద్యార్థులు, కార్యక్రమంలోని గ్రాడ్యుయేట్లలో 64% మంది మహిళలే ఉండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పతకాలు అందుకున్న విద్యార్థినుల సంఖ్య, పురుష విద్యార్థుల కంటే నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. ''ఇవి గణాంకాలు మాత్రమే కాదు. మహిళల నాయకత్వంలో అభివృద్ధి చెందిన భారతదేశ పురోగతిని సూచిస్తుంది. పురాతన కాలంలో గార్గీ, మైత్రేయి, అపాలా, లోపముద్ర లాంటి మహిళలు కీలక మేధో, ఆధ్యాత్మిక పాత్రలు పోషించారు. ఈ గణాంకాలు ప్రాచీన సంప్రదాయం కొనసాగింపును సూచిస్తాయి. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందాలంటే మనకు కుమారులతో పాటు కుమార్తెల భాగస్వామ్యం అవసరం. కుమారులు కష్టపడి, కుమార్తెలు వెనకే ఉంటే అభివృద్ధి చెందిన దేశం అనే కల నెరవేరదు'' అని పేర్కొన్నారు. యోగా, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం ప్రోత్సాహానికి పతంజలి విశ్వవిద్యాలయం అందిస్తున్న సహకారాన్ని ముర్ము ప్రశంసించారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతికి అనుగుణంగా జీవనశైలిని అవలంబించాల్సిన ప్రాముఖ్యతను రాష్ట్రపతి నొక్కి చెప్పారు.

జూబ్లీహిల్స్ లో విజయం కోసం బీజేపీ మహా పాదయాత్ర

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి విజయం కోసం బీజేపీ మహా పాదయాత్రకు శ్రీకారం చుట్టింది. ఆదివారం పాదయాత్రను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు రహ్మత్‌నగర్ డివిజన్‌లోని పార్టీ కార్యాలయం నుండి అట్టహాసంగా ప్రారంభించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, వేలాదిమంది కార్యకర్తలు మధ్య పాదయాత్ర ముందుకు కదిలింది. పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతూ జై బిజెపి నినాదాలతో మారు మోగించారు. అడుగడుగునా ప్రజల ఉత్సాహం రెట్టింపు అయింది. గడపగడపకు వెళ్లి ప్రజలను పలకరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ పాదయాత్ర కొనసాగించారు. ప్రతి బస్తీలో, కాలనీల్లో బిజెపి రథసారధికి ఆత్మీయ స్వాగతం పలికారు. జూబ్లీహిల్స్ ప్రజలతో బిజెపి నాయకులు నేరుగా మమేకమవుతూ, కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పాలనల్లో జరిగిన అన్యాయాలను, ప్రజలతో చేసిన మోసాలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం, అసమర్థతతో పలు బస్తీల్లో చోటుచేసుకున్న సమస్యలను, వెనుకబాటును వివరిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఈ పాదయాత్ర ఉప ఎన్నికలో విజయం సాధించేందుకు ఉత్సాహాన్ని, నమ్మకాన్ని మరింత పెంచింది. రహ్మత్‌నగర్ నుంచి శ్రీరాంనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి అక్రమ పార్కింగ్‌లతో నిండిపోయి ఉందని, ఒకవైపు డ్రైనేజీ దుర్వాసనతో పాటు డస్ట్‌బిన్లు నిండిపోవడంతో చెత్త రోడ్డు మీద పేరుకుపోయి పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు తెలిపారు. పలు బస్తీల్లో డ్రైనేజీలు నిండిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. 420 హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అందరినీ మోసం చేసింది. రెండేళ్ల పాలనలో ఒక్కరికి కూడా మంచి జరగలేదు. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇండ్లు కూలగొట్టుడు అనేలా భయపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామన్నారు, ఆడబిడ్డలకు నెలకు రూ.2500 ఇస్తామన్నారు, కానీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. ఆటో కార్మికుల కారోబార్లు దెబ్బతిన్నాయి, పరిశ్రమలు పారిపోతున్నాయంటూ ప్రజలు తమ సమస్యలను వివరించారు. ఇదే సమయంలో ఎంఐఎం నాయకుల అండదండలతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, కత్తులతో దాడులు చేస్తున్నారని భయాందోళన వ్యక్తం చేశారు.

మజ్లిస్, కాంగ్రెస్‌కుమ్మక్కు రాజకీయాలకు ముగింపు తప్పదు : రాంచందర్ రావు

బిజెపి వస్తే భద్రత లభిస్తుంది. ఎంఐఎం-కాంగ్రెస్-బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు ఇక ముగింపు పలికే సమయం వచ్చింది. అభివృద్ధి, భద్రత, పారదర్శకతను తీసుకొచ్చే బీజేపీకి ఓటు వేయండి అని ప్రజలను కోరారు. భారీగా తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తలు, బిజెపి నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఎటు చూసినా జనం, దారిపొడవునా అశేష అభిమానం చిరునవ్వుతో అడుగులు వేస్తూ, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను వింటూ, ప్రజల్లో ఆశలు చిగురింప జేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పాదయాత్ర కొనసాగించారు. అభిమానులతో ఫొటోలు దిగుతూ, ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు ప్రతి ఒక్కరు కమలం గుర్తు చూపించినప్పుడు ఓటు వేస్తామంటూ చెబుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో బిజెపి తప్పకుండా గెలుస్తుందని తాను నమ్ముతున్నానంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఓటమి భయం వెన్నాడుతోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి భయపడతున్నందునే ఎన్నికల ముందు మైనారిటీని మంత్రిని చేసి గంపగుత్తగా ఓ వర్గం ఓట్ల కోసం ఆరాట పడుతున్నాడని దుయ్యబట్టారు. చట్టపరంగా కరెక్ట్ అయినా ఓట్ల సమయంలో ఇలా చేయడం నైతికంగా తప్పని పేర్కొన్నారు. బెదిరించి ఓట్లు కొల్లగొట్టాలని కాంగ్రెస్ చూస్తుండగా డబ్బులు వెదజల్లి ఓట్లు రాబట్టుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోందన్నారు. ఈ రెండు పార్టీలు ఒకటే.. రెండు పార్టీలు కలిసి బీజేపీని ఓడించాలని పన్నాగాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ప్రజలను అంధకారంలో ఉంచుతోందని బీజేపీ పాదయాత్ర సందర్భంగా మీడియాల లైట్లే మాకు వెలుగునివ్వడం గుర్తించాలని జూబ్లీహిల్స్ ప్రజలు మోసాన్ని అర్థం చేసుకుని బీజేపీని గెలిపిస్తారని తెలిపారు. జూబ్లీహిల్స్ ప్రజల విశ్వాసం, ప్రేమ, ఉత్సాహం - ఈ మహా పాదయాత్రను విజయవంతం చేశాయి. ప్రజల ఆశీర్వాదంతో బీజేపీ ఈ ఉపఎన్నికలో విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.